

# ఎన్నికల ప్రణాళిక - 2014

# ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ

## ఎన్నికల ప్రణాళిక -2014 సాధారణ ఎన్నికలు



"గతం గత: ఇక ఇప్పుడు భవిష్యత్తే మనకు ఆశాజ్యోతి. ఈ భవిష్యత్తు హాయిగా వెనక్కి జారగిలపడి ఉపశమనం పొందడానికో, విశ్రాంతి తీసుకోవడానికో కాదు, తీవ్రంగా కష్టపడడానికి. మనం ఇప్పటివరకు తరచుగా చేస్తున్న వాగ్దానాలను, ఇప్పుడు ఈరోజున మనం చేస్తున్న ప్రమాణాలను నెరవేర్చుకోవడానికి కష్టపడాలి. భారతదేశానికి సేవ చేయడమంటే లక్షలాది తాడిత, పీడిత వర్గాల సేవ చేయడమే. అంటే–పేదరికాన్ని తుడిచిపెట్టడం, అజ్ఞానాంధకారాలను తొలగించడం, రోగాలకు దూరంగా బతకడం, అవకాశాల్లో అసమానతలను రూపు మాపడం...."

**–పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ**

(చరిత్రాత్మకమైన 'ట్రిస్ట్ విత్ డెస్టనీ' ప్రసంగపాఠం నుంచి)



" అభివృద్ధి అంటే కర్మాగారాలు, ఆనకట్టలు, రహదారులు కాదు, అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధి. ప్రజల భౌతిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ఆశయాల సాధనే మన లక్ష్యం. అభివృద్ధిలో మానవీయకోణానికి అత్యంత విలువ ఉన్నది."

**–రాజీవ్ గాంధీ**

(మాజీ ప్రధాని)

ప్రతి చేతికి శక్తి
ప్రతి చేతికి అభివృద్ధి



1885లో స్థాపింపబడిన భారత జాతీయ కాంగ్రెస్ శతాబ్దాల వలస పాలననుండి ఆగస్ట్, 1947లో దేశానికి రాజకీయ స్వాతంత్ర్యాన్ని సంపాదించి పెట్టడంలో మార్గదర్శక పాత్ర పోషించింది.

విదేశీ పెత్తందారీ పాలనకు వ్యతిరేకంగా దేశ ప్రజలకు నాయకత్వం వహించిన, అహింసా సిద్ధాంతకర్త మహాత్మాగాంధీ దృష్టిలో స్వాతంత్ర్యం అంటే – 'కేవలం రాజకీయ విమోచన కాదు, అంతకంటే చాలా ఎక్కువ. అంటే సమాజంలో అట్టడుగున మిగిలిపోయిన ప్రజల సర్వతోముఖాభివృద్ధి , వారి సంపూర్ణ సంక్షేమం. వీరిలో కూడా చాలా మంది దురదృష్టవశాత్తూ వారి జన్మభూమి మీదనే... వారి సొంత ఊళ్ళలోనే... సొంత పట్టణాల్లోనే... వారి సాటి మనుషులచేత అంటరానివారిగా పరిగణింపబడుతున్న వారి సంపూర్ణ సంక్షేమం సాధించడమే స్వాతంత్ర్యమంటే..."

ఇక 1947లో కాంగ్రెస్ పార్టీకి అధికారపగ్గాలు చేతికి అందేనాటికి... శతాబ్దాల దోపిడీ, అణచివేత తర్వాత రైల్వేలు, రెవిన్యూ, పోలీస్ వ్యవస్థల్లో దేశం గొప్పగా చెప్పుకోవడానికి ఏమీ మిగిలిలేదు. మొత్తం అన్నీ మొదటి నుండి చివరివరకూ సమకూర్చుకోవాల్సిన బాధ్యత భారతదేశంపై పడింది. సుశిక్షితులైన సాంకేతిక నిపుణులు లేని, పరిశ్రమలులేని, వైజ్ఞానిక పునాదులు లేని, విద్యుచ్ఛక్తిలేని, రహదారులులేని, మధ్యతరగతిలేని దేశంలో పారిశ్రామిక సరుకులకు డిమాండ్ పెంచడానికి ఏ విదేశీ పెట్టుబడులు రావు కదా !

అయితే తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వంటి గొప్ప మానవతావాది, దార్శనికుడి కారణంగా భారత్ ఒక వైభవోపేతమైన, వైజ్ఞానిక దేశంగా, పారిశ్రామిక శక్తిగా ఎదగడమేకాక తృతీయ కూటమి దేశాలకు నాయకత్వం వహించే స్థాయికి, బాధలు చెప్పుకోలేని ఆర్తుల గొంతుకగా మారేస్థాయికి ఎదిగింది. 5 లక్షల పైచిలుకు గ్రామాల్లో ఏ ఒక్క గ్రామానికి కూడా కరెంటివ్వలేని పరిస్థితి నుండి కేవలం 1400 మెగావాట్ల ఉత్పాదక సామర్థ్యం నుండి 1997 నాటికే ఒక లక్షా 5 వేల మెగావాట్ల అత్యుత్తమమైన విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసే స్థాయికి, 5 లక్షల 87 వేల గ్రామాలకుగానూ 5 లక్షల 9 వేల గ్రామాలకు విద్యుచ్ఛక్తిని అందించే స్థాయికి చేరుకున్నది.

నెహ్రూ ప్రారంభించిన సేద్యపునీటితోపాటూ విద్యుదుత్పాదనవంటి భారీ బహుళార్థసాధక ప్రాజెక్ట్‌లన్నీ ప్రధానిగా శ్రీమతి ఇందిరాగాంధీ పూర్తిచేసారు. అంతేకాక, ఒక వైపు హరిత, శ్వేత, పసుపు, ఊదా విప్లవాలను చేపట్టి ఏకంగా బ్యాంకుల జాతీయాకరణతో పల్లెటూరి పౌరుడికి కూడా బ్యాంకు ద్వారాలు తెరచి రుణసౌకర్యాలు అందేటట్లు చేసారు. 1947 వరకు ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకున్న దేశం ఇప్పుడు ప్రపంచంలో ఆహార ధాన్యాలను అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న దేశాల్లో ఒకటయింది. ఒక సామాజిక వ్యవస్థను క్రమబద్ధీకరించడంలో గానీ, పటిష్టమైన రక్షణశక్తిగా దేశాన్ని తమారుచేయడంలో గానీ ఆమె కృషి అపూర్వం. ఆమె ప్రవేశపెట్టిన

'ఇందిరాగాంధీ 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం' దేశంలో సామాజిక, ఆర్థిక పునరుద్ధరణలో ప్రభుత్వాలకు గీటురాయిగా మారింది.

ఇక రాజీవ్ గాంధీ రంగప్రవేశం తర్వాత మన టెలికమ్యూనికేషన్స్ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. 1947 లో కేవలం 1 లక్షా 40 వేల టెలిఫోన్లుండగా ఇప్పుడు 5 కోట్ల కనెక్షన్లు ఉన్నాయి. పారిశ్రామిక ఉత్పత్తుల్లో చాలా మటుకు భారత్ స్వయం సమృద్ధిని సాధించింది. అంతేకాదు, 1990 దశకం ఆరంభంలో ప్రపంచంలోని అతి పెద్ద వైజ్ఞానిక వనరులున్న దేశాల్లో రెండో స్థానాన్ని భారత్ కైవసం చేసుకున్నది. అలాగే అతిపెద్ద పారిశ్రామిక దేశాల్లో మన దేశం కూడా స్థానం సంపాదించింది. ఇంచుమించు ఇదే కాలంలో ఆయన హయాంలో రాజ్యాంగంలోని 73, 74 వ సవరణల ద్వారా స్థానిక సంస్థలను బలోపేతం చేయడం ద్వారా ఆయన కొత్తదారులు చూపారు. దేశ వ్యాప్తంగా పౌర, రక్షణ పరిశోధనా ప్రయోగాశాలలను విరివిగా నెలకొల్పడం ద్వారా అంతరిక్ష, అణుశక్తి కార్యక్రమాల్లో స్వదేశీ పరిజ్ఞానాన్ని వినియోగించే అతి కొద్ది దేశాల్లో భారత్ కూడా ఒకటికాగలిగింది.

ఇటువంటి చర్యలవల్ల 1980 దశకం ఆరంభంలోనే ప్రపంచంలో వేగంగా వృద్ధి నమోదు చేసుకున్న ఆర్థిక వ్యవస్థలో (1980-91 కాలంలో 5.8% సగటు వార్షిక వృద్ధిరేటుతో) మన దేశం కూడా చోటు సంపాదించుకోగలిగింది. దీనివల్ల 1991లో ప్రధాని పివి నరసింహారావు ప్రభుత్వం పలు ఆర్థిక సంస్కరణలు తీసుకురాగలిగింది. తత్ఫలితంగా మునుపెన్నడూ లేని విధంగా 1992-97 నాటి 8 వ పంచవర్ష ప్రణాళికా కాలంలో 6.7% జిడిపి వృద్ధిరేటును భారత్ నమోదు చేసుకోగలిగింది. అంటే కొనుగోలు శక్తి ప్రాతిపదికన జిడిపి అంచనాల్లో అమెరికా, జపాన్, చైనా ల తరువాత నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా రూపుదాల్చింది.

ఎన్‌డిఏ ప్రభుత్వం అనాలోచిత, అనుభవరాహిత్య విధానాల కారణంగా 1992-97 లో 6.7% ఉన్న దేశ ఆర్థికవృద్ధి 1998-2004 కాలానికి 5.5% కి పడిపోయింది. ఎన్‌డిఏ ప్రభుత్వానికి ఏవయినా కీర్తికిరీటాలు తగిలించాలనుకుంటే - లాభసాటిగా నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మాలని దృఢంగా సంకల్పించినందుకు ఆ గౌరవం వారికివ్వవచ్చు. విదేశీ రుణాలను తీర్చేసామని గొప్పలు చెప్పుకుంటున్న ఎన్‌డిఏ ప్రభుత్వం నిజానికి అప్పులు పెంచింది. 1.4.1998 నాటికి 7,78,294 కోట్ల మేరకున్న రుణాలను 28.2.2004 నాటికి 17,80,964 కోట్లకు పెంచింది. అంటే భారత దేశపు రుణాలు 7,78,294 కోట్లకు చేరడానికి 50 ఏళ్ళు పడితే, ఎన్‌డిఏ కేవలం ఆరేళ్ళు కూడా నిండకముందే రూ. 10 లక్షల కోట్లకు పెంచేసింది.

## కాంగ్రెస్ - ఆంధ్రప్రదేశ్

1947 లో ప్రపంచ ఆర్థిక, మానవవనరుల



అభివృద్ధి సూచిక పటంలో భారత్ అట్టడుగున ఉంది. ఇక 1956 లో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలోని, హైదరాబాద్ రాష్ట్రంలోని ప్రాంతాలను కలిపి కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిస్థితి మరీ దయనీయం.

అటువంటి పరిస్థితుల్లో వరుసగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ పునాదులను పటిష్ఠం చేసాయి. తొలి మూడు దశాబ్దాల్లో తుంగభద్ర, నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్, జూరాల, గోదావరి ఆనకట్ట పునర్నిర్మాణం, ఎగువ సీలేరు, దిగువ సీలేరు, బలిమెల వంటి పలు భారీ నీటి పారుదల ప్రాజెక్టుల తోపాటూ చాలా మధ్యతరహా, చిన్ననీటిపారుదల ప్రాజెక్టులు కూడా అమలు చేసారు. 1956 లో 100 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం ఉన్న రాష్ట్రం ఇప్పుడు 6 వేల మెగావాట్లకు పెరిగింది. దీనిలో ఎక్కువ భాగం మెట్ట ప్రాంతాల సాగుకు వినియోగించడంతో, ఎక్కువ ప్రాంతాలను సేద్యం కిందకు తీసుకురావడానికి తోడ్పడింది. ఇవిగాక ఇతరత్రా వ్యవసాయ పథకాలుకూడా మెరుగ్గా అమలుచేయడంతో 1956 లో హెక్టార్‌కు 917 కిలోల వరి ధాన్యం పండించగా 1995 నాటికి 2812 కిలోలకు పెంచడం జరిగింది. అంటే గిట్టుబాటు సామర్థ్యాన్ని బాగా మెరుగు పరచినట్లయింది.

అంతేకాదు, వరుసగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు బిహెచ్ఇఎల్, హెచ్ఎఎల్, ఐడిపిఎల్, హెచ్‌సిఎల్, ఇసిఐఎల్, బిహెచ్‌పివి, మిథాని, బిడిఎల్, వైజాగ్ స్టీల్ ప్రాజెక్ట్, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ, ఎన్ఎఫ్‌సి, బిఇఎల్ వంటి పలు ప్రభుత్వ రంగ సంస్థలను నెలకొల్పాయి. ఈ ప్రాజెక్టులకు తోడు అనుబంధంగా వచ్చిన పలు కర్మాగారాల వల్ల రాష్ట్రంలో లక్షలాది కార్మికులకు ఉపాధి దొరికింది. దానితోపాటూ రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం కూడా పెరిగింది. అలాగే ఈ తొలి మూడు దశాబ్దాల్లో సిసిఎంబి, డిఆర్‌డిఎల్, డిఎల్‌ఆర్ఎల్, డిఎంఆర్ఎల్, ఎన్ఐఎన్, ఎన్ఆర్ఎస్ఎ, ఎన్‌జిఆర్ఐ, ఐఐసిటి, శ్రీహరికోట ఉపగ్రహ ప్రయోగ కేంద్రం, ఇక్రిశాట్ వంటి పలు ప్రతిష్ఠాత్మక పరిశోధనా కేంద్రాలు కూడా రాష్ట్రంలో ఏర్పడ్డాయి. వీటన్నింటివల్ల దేశంలో ఆంధ్రప్రదేశ్ ఒక విజ్ఞాన కేంద్రంగా ఎదగగలిగింది. 1990 దశకం ఆరంభంనాటికి దేశ బల్క్‌డ్రగ్స్, ఔషధాల రాజధానిగా మారింది. దేశంలో సిమెంట్‌ను అత్యధికంగా తయారు చేసే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటయింది. కోళ్ల పరిశ్రమకు కూడా ఆంధ్రప్రదేశ్ రాజధాని అయింది.

1970 ఆరంభంలోనే వెనుకబడిన తరగతులు సామాజికంగా సాధికారితను సాధించడానికి కృషి చేసిన తొలి రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ కూడా ఒకటి. రాజ్యాంగపరమైన ఆంక్షలేమీ లేకపోయినా విద్య,

ఉపాధిరంగంతోపాటూ స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ కల్పించింది. ఈ తరగతి యువతకు ఆర్థిక సాయం అందించడానికి వెనుకబడిన తరగతుల ఆర్థిక సంస్థను నెలకొల్పింది. ఎస్సి, ఎస్టిల అభివృద్ధికి ఎస్సి, ఎస్టి ఫైనాన్స్ కార్పొరేషన్ను, లిడ్క్యాప్ను ప్రారంభించింది. మైనారిటీలకోసం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీ ఆర్థిక సంస్థను ప్రత్యేకంగా నెలకొల్పింది. లంబాడాలను కూడా ఎస్టిలలో చేర్చాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడంతో లంబాడాల బాధలు తొలగించడం సుసాధ్యమయింది.

తొలిదశలో బాలారిష్టాలు ఎదుర్కొన్నా 1980-90 ల నాటి ఆర్థిక, సామాజిక సూచికలపరంగా చూస్తే మిగిలిన పెద్ద రాష్ట్రాలతో పోటీపడి జాతీయ సగటుకంటే ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వృద్ధిరేటును ఎక్కువగా నమోదు చేసుకుంది.

మానవ వనరుల సూచిపరంగా చూస్తే ఆంధ్రప్రదేశ్ 9వ స్థానం సంపాదించగలిగింది. 1975-85 మధ్యకాలంలో హైటెన్షన్ విద్యుత్ కనెక్షన్లకు ఏటా 12.5% చొప్పున పెరిగాయి. అంటే పారిశ్రామిక పెట్టుబడులు, అభివృద్ధిలో చాలా గణనీయమైన ఉత్తమస్థాయి కిందలెక్క. ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమర్థవంతమైన చర్యల వల్ల రెవిన్యూ ఖర్చు ఎప్పుడూ పూర్తి అదుపులోనే ఉంది. ఎంతగా అంటే 1978-83 లో రెవిన్యూ లోటు అనేదే లేదు. 1990-95 మధ్యకాలంలో ఇది కేవలం 2.64% మాత్రమే. నిజానికి రెవిన్యూ రాబడి అతి తక్కువగా రు.7146 కోట్లున్నప్పటికీ ఇది సాధ్యపడింది. ఇక ఆస్తులు, అప్పుల నిష్పత్తి అయితే 1995లో 1.01:1 గా ఉంది.

**అందువల్ల కాంగ్రెస్ ప్రభుత్వాలు సృష్టించిన అత్యంత సమర్థ మౌలిక సదుపాయాల కారణంగానే గత 50 ఏళ్ళలో ఆంధ్రప్రదేశ్ చాలా వేగంగా అభ్యున్నతి సాధించగలిగింది.**

**గత పదేళ్ళలో ఆంధ్రప్రదేశ్‌లో భారత జాతీయ కాంగ్రెస్ సారథ్యంలో సాధించిన విజయాలలో కొన్ని......**

- రైతులకు ఉచిత విద్యుత్
- రు. 50 వేల వరకున్న అప్పులు ఒన్‌టైం సెటిల్‌మెంట్ చేసుకునే సౌకర్యం
- ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు రు. 1.5 లక్షల పరిహారం
- ఫీజులు తిరిగి చెల్లింపు పథకం ప్రారంభం. ఇంజనీరింగ్, మెడిసిన్, ఎంసిఏ, బిఎడ్ వంటి వృత్తివిద్యా కోర్సులు అభ్యసించే ఆర్థిక బలహీన వర్గాల విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం అమలు. 2012-13

లో ప్రభుత్వం దీనికి రు. 5 వేల కోట్లు కేటాయించింది. దీనివల్ల 26 లక్షల మంది విద్యార్థులు లబ్ధిపొందారు.

- గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు గ్రామీణులకు ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణ పథకం. ఈ ఐదేళ్ళలో ఈ పథకం కింద 12.50 లక్షల ఇళ్ళు పూర్తయ్యాయి.

- బాగా ప్రజాదరణ పొందిన 'అందరికీ ఆరోగ్యం' పథకం - రాజీవ్ ఆరోగ్యశ్రీ. పేదలకు అత్యుత్తమ ప్రమాణాలుకల చికిత్సనందించే ఈ పథకం కింద నిరుపేదల కుటుంబాలకు సంవత్సరానికి రు. 2 లక్షల వరకు ఆస్పత్రి ఖర్చులు, శస్త్ర చికిత్స ఖర్చులు ప్రభుత్వం భరిస్తుంది.

- 72 లక్షల కుటుంబాల వారికి లబ్ధి చేకూరేలా వంటగ్యాస్ సిలిండర్ ఖర్చులో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నది. ఏటా రు. 216 కోట్లు దీనికి ఖర్చవుతున్నాయి.

- మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని 2006 నుంచి అమలు చేస్తున్నది. ఈ పథకం కింద ఇప్పటి వరకు 93,74,212 కుటుంబాలు లబ్ధి పొందాయి. రు. 20,799 కోట్లు వేతనాల కింద చెల్లించడం జరిగింది. వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, కాన్పులకు ప్రతినెలా ఒకటో తేదీన 70 లక్షల మందికి పింఛన్‌లు చెల్లించడం జరుగుతున్నది.

- అభయ హస్తంకింద 60 ఏళ్ళు దాటిన దాదాపు 50 లక్షల మందికి స్వయం సహాయక బృందాల మహిళలకు నెలవారీ పింఛన్‌లు చెల్లించడం జరుగుతున్నది. మరణం వంటి బీమా చెల్లింపులకు ఇది అదనం.

- చరిత్రాత్మకమైన ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక, గిరిజనుల ఉప ప్రణాళిక, (ఆర్థిక వనరుల ప్రణాళిక, కేటాయింపులు, వినియోగం) చట్టం, 2012 ను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుచేస్తున్నది. వారి జనాభాకు తగ్గట్టుగా షెడ్యూల్డు కులాలకు, గిరిజనులకు నిధులు కేటాయించి చట్టబద్ధంగా ఉప ప్రణాళికలు అమలు చేస్తున్నాం. దేశంలో ఇలా చేయడం ఇదేప్రథమం.

### మా దృఢ సంకల్పం ఇంకా...

- ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉపాధి కల్పించడానికి ప్రభుత్వ ఉపాధి కల్పనా కేంద్రాలను (ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ లను) ఆధునికీకరిస్తాం. విదేశాల్లో ఉద్యోగాల కోసం వెళ్ళేవారికి అవసరమయిన సహాయ సహకారాలు అందించడానికి సలహా కేంద్రాలుగా కూడా వీటిని అభివృద్ధి పరుస్తాం.

- వెనుకబడిన తరగతుల ఉప ప్రణాళిక కూడా తెస్తాం. ఏటా వెనుకబడిన తరగతుల కార్యాచరణ ప్రణాళిక కోసం ప్రణాళికా బడ్జెట్ నుండి కొంత మొత్తాన్ని కేటాయిస్తాం.

వెనుకబడిన తరగతుల విద్యార్థులకు హాస్టల్ సౌకర్యాలు మెరుగుపరుస్తాం. వారికి మరిన్ని ఆశ్రమ పాఠశాలలు ప్రారంభిస్తాం. ఈ తరగతులకు చెందిన వృత్తి కళాకారులకు ఆదాయవనరులను పెంచే విధంగా, వారి జీవన ప్రమాణాలు పెరిగేలాగా, ఉత్పత్తులకు గిరాకీ మార్కెట్ లభించేలాగా వారికి తోడ్పడతాం. బిసి ఫైనాన్స్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేస్తాం.

- వచ్చే ఐదేళ్ళకాలంలో స్వయం ఉపాధిని ప్రోత్సహించడం ద్వారా కానీ, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు పొందడానికి దాదాపు లక్ష మంది యువతీయువకులకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం సహకరిస్తుంది.

- అన్ని మండల కేంద్రాల్లో రాజీవ్‌గాంధీ గ్రామీణ యువక కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. విద్యార్థులు, యువకులు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విద్య, ఉపాధి అవకాశాలను తెలుసుకోవడానికి వీలుగా ఈ కేంద్రాల్లో గ్రంథాలయం, కంప్యూటర్లు, ఇంటర్‌నెట్, ప్రింటర్లు, స్కానర్లవంటి వాటితో పూర్తి ఐటి సదుపాయాలుంటాయి. ప్రభుత్వ సేవలు, పథకాల సమాచారం కూడా వీటిలో అందుబాటులో ఉంచుతాం.

- ప్రతి శాసనసభా నియోజక వర్గ పరిధిలో ఒక నవోదయ తరహా పాఠశాలను ప్రారంభిస్తాం.

- ప్రతిమండల కేంద్రంలో ఒక పాలిటెక్నిక్ లేదా ఐటిఐ ఏర్పాటుచేస్తాం.

- ప్రతి మండలంలో ఎస్‌సి, ఎస్‌టిలకు ఒక ఆశ్రమ పాఠశాల తెరుస్తాం.

- స్వయం సహాయక బృందాల మహిళలు వారి ఆదాయ వనరులు పెంచుకోవడానికి వీలుగా వచ్చే మూడేళ్ళ కాలంలో లక్ష వరకు వడ్డీలేని రుణాలు అందిస్తాం.

- మోసకారి వ్యాపారుల నుంచి రక్షణకు రైతులకు సహాయపడే విధంగా సమగ్ర విత్తన క్రమబద్ధీకరణ చట్టాన్ని తెస్తాం.

- పోలవరం ప్రాజెక్ట్‌ను జాతీయ ప్రాజెక్ట్‌గా అభివృద్ధి చేస్తాం. ఐదేళ్ళలో పూర్తి చేస్తాం. వీలయినంతమేర సేద్యపు నీటి సౌకర్యం కలిగించడంతోపాటూ జలరవాణాకు వీలుగా గోదావరిని అభివృద్ధి పరుస్తాం. ఇప్పటికే అమల్లో ఉన్న జలయజ్ఞం ప్రాజెక్ట్‌లను నిర్ణీతకాల వ్యవధిలో పూర్తి చేస్తాం.

## మా ఎన్నికల ప్రణాళిక -2014

కొత్తగా ఏర్పడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్త ఉపాధి అవకాశాలు పెంచడంతోపాటూ మానవ వనరుల అభివృద్ధి సూచికను మెరుగుపరుస్తూ, దీనిని అత్యంత అభివృద్ధి సాధించే రాష్ట్రంగా మార్చడానికి



కాంగ్రెస్ పార్టీ పునరంకితమవుతుందని హామీ ఇస్తున్నాం.

పంచయత్‌రాజ్, స్థానిక సంస్థలకు మరిన్ని అధికారాలు కట్టబెడతాం. రాష్ట్రంలో ఎదుగుదల, అభివృద్ధికి ఎక్కడ అవకాశాలున్నాయో గుర్తించి వాటికి అనుగుణంగా వ్యూహాలు, ప్రణాళికలు పునర్‌నిర్వచిస్తాం. అభివృద్ధి, పెరుగుదలకు వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తాం. కాలపరీక్షకు తట్టుకుని నిలిచిన ప్రజాస్వామ్య వ్యవస్థలకు సవాలుగా మారిన తీవ్రవాద ఉద్యమాన్ని సామాజిక, ఆర్థిక కోణంలో పరిశీలించాల్సిన అవసరం ఉంది. అందువల్ల వారితో చర్చలుజరిపి తగువిధంగా పరిష్కరిస్తాం. ప్రజాస్వామ్యంలో హింసకు తావుండకూడదనే మా విశ్వాసం. అందువల్ల చర్చలు, సంభాషణల ద్వారా ఈ సమస్యను పరిష్కరించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది. గత పదేళ్ల కాలంలో దీనిని విజయవంతంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిష్కరించింది.

ఏళ్ళతరబడి మూతబడిన లేదా మూల బడిన పలు పరిశ్రమలను తిరిగి ప్రారంభింప చేయాలనే అంశంపై ఎక్కువ శ్రద్ధ చూపుతాం. పర్యాటకరంగాన్ని, తక్కువ ఖర్చుతో సినిమాలను ప్రోత్సహించడం ద్వారా సినిమా పరిశ్రమకు, ఐటి, ఐటిసేవలకు మునుపటిలాగే మా పార్టీ తోడ్పాటునందిస్తుంది. స్వాతంత్ర్యం రాకముందు నుంచీ సామాజిక న్యాయం, సాధికారికత కోసం ముందుండి పోరాడిన కాంగ్రెస్ పార్టీ తర్వాత కూడా అదే స్ఫూర్తితో మహిళలకు, యువతకు, ఇతర సామాజిక. ఆర్థిక, వెనుకబడిన తరగతుల సాధికారితకోసం పాటుపడుతుంది.

## మా ప్రణాళికలో ప్రధానాంశాలు :

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రణాళికా కమిటీ అవశేష ఆంధ్రప్రదేశ్‌ను 'నవ్యాంధ్రప్రదేశ్'గా మార్చడానికి దశ సూత్ర ప్రణాళికను రచించింది. కానీ ఐదేళ్ళలో 9% వృద్ధి రేటు నమోదు చేసుకుని మిగిలిన రాష్ట్రాలతో పోటీపడేవిధంగా వనరుల పుష్టి సాధించే విధంగా పలు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ కమిటీ ఎంపిక చేసిన ఈ సూత్రాలన్నీ ఆచరణ సాధ్యమే కాక అన్నిరంగాల ప్రజలకు వాస్తవంగా చేయూత నందించగలిగినవి. అలా కొత్త రాష్ట్రం దేశంలో అభివృద్ధిపరంగా నంబర్ ఒన్ రాష్ట్రం అవుతుంది.

## ఉద్యోగుల సంక్షేమం :

సామాన్య మానవుడి సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధితోపాటూ కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమాన్ని ప్రాధాన్యతా అంశంగానే పరిగణిస్తున్నది.

ప్రభుత్వోద్యోగులు కూడా ప్రజాస్వామ్య దేశంలోని ఏ ప్రభుత్వం లోనయినా ఒక భాగమేననేది కాంగ్రెస్‌పార్టీ విశ్వాసం. వారి సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలోని కాంగ్రెస్

ప్రభుత్వాలు ఎప్పుడూ గట్టి కృషి చేసున్నాయే ఉన్నాయి. వారి సహకారం, వారి శ్రమ వల్లనే కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలన్నీ విజయవంతం అయ్యాయి.

కాలపరిమితి ముగియక ముందే 10 వ వేతన సంఘాన్ని ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. దాని పూర్తి, తుది నివేదిక అందేవరకు 27 % ఇంటరిమ్ రిలీఫ్ (తాత్కాలిక ఉపశమనం) చెల్లించాలని కమీషన్ చేసిన సిఫార్సును కూడా ప్రభుత్వం అంగీకరించింది. ప్రభుత్వోద్యోగులు వారి సర్వీస్‌లో ఇంత పెద్ద మొత్తంలో ఇంటరిమ్ రిలీఫ్ మునుపెన్నడూ పొందలేదు.

విభజన తర్వాత కూడా ప్రభుత్వోద్యోగులు చాలా సమస్యలు ఎదుర్కొంటారు. ఒక్క కాంగ్రెస్ పార్టీ, దాని ప్రభుత్వం మాత్రమే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించగలదు. ఉద్యోగులకు శాశ్వత గృహ నిర్మాణం, కుటుంబ ఆరోగ్యకార్డ్‌ల ను ప్రవేశపెట్టడంవంటి కొత్త పథకాలు కాంగ్రెస్ పార్టీ మాత్రమే చేస్తుంది. కుటుంబ ఆరోగ్య కార్డుల పథకం అయితే పైలట్ ప్రాజెక్ట్‌గా ఇప్పటికే ప్రారంభించేశాం. ఇప్పటికే 5 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ అస్పత్రుల్లో చికిత్సపొందారు.

అవశేష ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ సర్వీస్ నుండి రిటైరయ్యే లోపల ప్రతి ఉద్యోగి శాశ్వత గృహనిర్మాణ ప్రయోజనం పొందే విధంగా చేయడానికి కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యం ఇస్తుంది.

అంతేకాక ఈ కింది అంశాలకు కూడా అత్యధిక ప్రాముఖ్యతనిస్తుంది.

- సూపర్ యాన్యుయేషన్ రిటైర్‌మెంట్ వయస్సును 58 నుండి 60 ఏళ్ళకు పెంచడం.
- ప్రభుత్వ పాలక యంత్రాంగంలో 5 రోజుల పనిదినాలను ప్రవేశ పెట్టడం

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2013 లో పేర్కొన్న ఉద్యోగుల సమస్యలకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని అమలుపరచడానికి కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యం ఇస్తుంది.

ఉపాధ్యాయుల సమస్యలకు సంబంధించి ఎప్పటికప్పుడు వారికిచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుంది.

రాష్ట్ర విభజన ఫలితంగా ఏర్పడే ఖాళీలన్నింటినీ భర్తీచేయడానికి మా పార్టీ ఎక్కువ ప్రాధాన్యత నిస్తుంది. శాశ్వత నియామకాల ద్వారా వాటిని భర్తీచేస్తాం.

భారత జాతీయ కాంగ్రెస్ ఇచ్చిన కీలక వాగ్దానాల అమలుకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అవశేష ఆంధ్రప్రదేశ్‌లో రంగాలవారీగా అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుంది.

## 1. వ్యవసాయం :

పారిశ్రామిక సరుకులకు గిరాకీ ఉన్న



ప్రాంతంగా అభివృద్ధి పరచాలంటే రాష్ట్రంలోని 65% మంది శ్రామికులు సమర్థవంతంగా పనిచేసి, మిగులు సృష్టిస్తే తప్ప అధిక ఆర్థిక పెరుగుదల రేటులో స్థిరత్వాన్ని సాధించడం అసాధ్యమని మేం గుర్తించాం.

ఇప్పుడున్న పద్ధతిలోనే ఎటువంటి మార్పులు చేయకుండా వ్యవసాయ దిగుబడులు పెంచే అంశాలపై వెంటనే ఎక్కువ శ్రద్ధ చూపడానికి వీలుగా ముఖ్యమంత్రి అధ్యక్షతన వ్యవసాయ టెక్నాలజీ మిషన్‌ను ఏర్పాటుచేయడం జరిగింది. సకాలంలో విత్తనాలు నాటడం, సాగునీటి నిర్వహణ పద్ధతుల సక్రమ వినియోగంవంటి అంశాల్లో ఇబ్బందులను తొలగించి పటిష్టమైన చర్యలు తీసుకునేలా చేయడం దీని ఉద్దేశం. ఇప్పుడు హెక్టార్‌కు 2980 కిలోలున్న వరి దిగుబడిని 4 వేల కిలోలకు, 80 మెట్రిక్‌టన్నులున్న చెరకు దిగుబడిని 110 మెట్రిక్ టన్నులకు పెంచడంపై ఎక్కువ శ్రద్ధ చూపుతాం. అధికంగా నీటిపారుదలపై అదనపు పెట్టుబడులు లేకుండా సమర్థవంతమైన చిట్కాల ద్వారా వచ్చే మూడు, నాలుగేళ్ళలో సాధించాలనేది దీని ఉద్దేశం. దీనికి తోడు ఇప్పుడున్న సూక్ష్మ సేద్యపు ప్రాజెక్ట్‌లను రు. 1600 కోట్ల మూల పెట్టుబడితో వచ్చే ఐదేళ్ళలో 5.05 లక్షల హెక్టార్లలో మరింత పటిష్టంగా చేయడం కూడా దీని ఉద్దేశం.

### మా వాగ్దానం

- దళారీ వ్యవస్థ లేకుండా రైతులనుంచి వరి ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేయడానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు.
- తుఫాన్లు, పెనుగాలుల వంటి సహజ విపత్తులను ఎదుర్కోవడానికి వీలుగా రు. 5 వేల కోట్లతో రైతుల అత్యవసర సహాయనిధి ఏర్పాటు.
- ఇంతకుముందు ప్రతిపాదించినట్లు సహజ వాయువుతో పనిచేసే ఇఫ్కో ఎరువుల కర్మాగారాన్ని నెల్లూరులో ఏర్పాటుచేయడం. ఎరువులు తగినన్ని లభ్యమయ్యేటట్లు కాంగ్రెస్ పార్టీ జాగ్రత్తలు తీసుకుంటుంది.
- రైతులకు బ్యాంకులు, సహకార సంఘాలు ఇచ్చే పంటరుణాలపై వడ్డీలో 6% వరకు సబ్సిడీగా ఇస్తాం. మొత్తం రుణాల్లో 18% వ్యవసాయ రంగానికి ఇవ్వాలన్న ఆర్‌బిఐ నిబంధనలకు, నాబార్డ్ పథకాలకు అనుగుణంగా వాణిజ్య బ్యాంకులు వ్యవహరించేలా చర్యలు తీసుకుంటాం.
- గ్రామీణ రంగంలో సహకార పరపతి వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తాం. రైతుల పరస్పర సహకార సంఘాల ద్వారాకానీ, గ్రామ పంచాయతీల ద్వారా కానీ వ్యవసాయానికీ దాని అనుబంధ కార్యక్రమాలకు రుణాలు సక్రమంగా, సాఫీగా అందేలా చేయడమే దీని ఉద్దేశం. థ్రిఫ్ట్ రుణాలనుకూడా ప్రోత్సహిస్తాం.
- బిందుసేద్యం, తుంపర పద్ధతులకు 90% సబ్సిడీని ప్రోత్సహిస్తాం.

- మార్కెటింగ్‌లో రైతులకు, వ్యవసాయదారులకు అమ్మకపు పన్నును 4% నుండి 2 % కు తగ్గించాలని ప్రతిపాదిస్తున్నాం.
- వ్యవసాయరంగానికి ఉచిత విద్యుత్ ఇస్తాం. పగలు 9గంటలపాటూ ఏకధాటిగా విద్యుత్ సరఫరా చేస్తాం.
- రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుల నివారణ మందులు సరఫరా చేస్తాం. కల్తీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు లేకుండా చేయడానికి పెనాల్టీలను విధించడానికి వీలుగా కేంద్ర ఔషధ చట్టం నమూనాలో ఒక చట్టాన్ని తెస్తాం.
- గ్రామ స్థాయిలో అన్ని పంటలకూ కేంద్ర ప్రభుత్వం పూర్తి పంటబీమా పథకం వర్తింప చేయడంలో ఆంధ్రప్రదేశ్‌ను ముందు నిలబెట్టడం.
- రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చడానికి పంటలను మార్చివేసుకోవడంలో, నీటి సామర్థ్య నిల్వను పెంచుకోవడంలో తోడ్పడే ఉద్దేశంతో ఉన్నత స్థాయి ఉద్యానబోర్డును ఏర్పాటు చేస్తాం.
- విస్తారంగా, వృథాగా ఉన్న మెట్ట భూములలో నిరుపేదలు ఆదాయ వనరులు పెంచుకోవడానికి వీలుగా పళ్ళ తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తాం. దిగుబడులపై హక్కులు వారికే భుక్తం చేస్తాం.
- రైతులకు తక్షణం అందుబాటులో ఉండే విధంగా మార్కెట్ యార్డులో వ్యవసాయ ప్రయోగశాలల ఏర్పాటుకు కాంగ్రెస్ కృషి చేస్తుంది.
- జాతీయబ్యాంకులు, ఆర్థిక సంస్థలనుంచి కౌలు రైతులు కూడా రుణాలు పొందడానికి పార్టీ కృషి చేస్తుంది.
- వ్యవసాయ కూలీలకు అండగా ఉండేందుకు శ్రామిక్‌బ్యాంకుల ఏర్పాటుకు కాంగ్రెస్ కృషి చేస్తుంది. ప్రస్తుతం ఇది కేరళలో అమల్లో ఉంది. కూలీలను ఏర్పాటుచేసుకున్న రైతు సకాలంలో వారి కూలీడబ్బు చెల్లించలేకపోతే ఈ బ్యాంకులు చెల్లించి తరువాత రైతునుంచి రాబట్టుకుంటాయి.

## 2. సేద్యపు నీటిపారుదల :

నీటి సక్రమ వినియోగం, నిల్వ నీటి వనరులను (వర్షపు నీటి నుంచి) పెంచుకోవడం వంటి చర్యలకు ఎక్కువ ప్రాధాన్యత. ఒక సంవత్సరం అంటే - 8760 గంటల్లో వర్షపాతం ఉండేది కేవలం 100 గంటలే. అందువల్ల వర్షం ఎక్కువగా పడేప్రాంతాల్లో దీన్ని సేకరించి ఏడాది పొడుగునా వాడుకోవడానికి వీలుగా భద్రపరుచుకోవాలి. ఇంచుమించు ఒక పరీవాహక ప్రాంతంలో ఒక పెద్ద నీటి పారుదల ప్రాజెక్ట్ కంటే పది చిన్న డ్యాంలలో ఎక్కువ నీరు నిల్వ చేసుకోవచ్చు.

### మా వాగ్దానం

- అదనంగా లక్ష హెక్టార్లకు ఖచ్చితమైన సేద్యపు

ప్రతి చేతికి శక్తి
ప్రతి చేతికి అభివృద్ధి



నీటివసతి కల్పించడానికి మా పార్టీ కృషి చేస్తుంది.

- కాలువల నీటితో కంటే ఎత్తిపోతలతో సేద్యం చేస్తున్న రైతుల పరిస్థితిని సమీక్షించి వారి కష్టాన్ని తగ్గించడానికి కృషి చేస్తాం.
- రు.1060 కోట్లతో ఐదేళ్ళలో ఐదు లక్షల హెక్టార్లలో బిందు, తుంపర సేద్యంచేపట్టడానికి వీలుగా భారీ నీటిపారుదల ప్రాజెక్ట్ అత్యంత ప్రాధాన్యతతో చేపడతాం.
- వివిధ ప్రాజెక్ట్‌ల కింద ముంపుకు గురయిన గ్రామాల ప్రజల సమస్యలను, వారి సేద్యపు నీటిపారుదల వసతులను సానుభూతితో పరిశీలిస్తాం.
- కర్నూల్, కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లా రైతులకు తోడ్పడే విధంగా తెలుగు గంగ ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తిచేస్తాం.
- గాలేరు-నగరి తొలిదశ పూర్తిచేయడం, కర్ణాటక సహకారంతో సమాంతర కాల్వ ఏర్పాటుచేయడం ద్వారా తుంగభద్ర కింద ఆయకట్టు పెంచడానికి కృషి చేస్తాం.
- హంద్రీనీవా తొలిదశ త్వరగా పూర్తి చేస్తాం. సోమశిల-స్వర్ణముఖి కాల్వ, గురు రాఘవేంద్ర స్వామి కాల్వ, ఎస్ఆర్ఎస్‌సి, వరదనీటి కాల్వలను వెంటనే పూర్తి చేస్తాం.
- పోలవరం ప్రాజెక్ట్‌ను చేపట్టడం ద్వారా విశాఖ జిల్లాకు మంచినీటి అవసరాలు తీర్చడమేకాక, తూర్పు-పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లాలోని సాగు సామర్థ్యాన్ని తగినంతగా పెంచుతాం.
- కృష్ణా, గోదావరి, పెన్నా నదుల అనుసంధానం చేపడతాం.
- జంఝావతి, తోటపల్లి, వంశధార రెండో దశ సేద్యపు ప్రాజెక్ట్‌లు నిర్ణీత వ్యవధిలో పూర్తి చేస్తాం.
- పెండింగ్‌లో ఉండిపోయిన అంతర్ రాష్ట్ర సేద్యపు నీటి ప్రాజెక్ట్‌లను, ఆయా రాష్ట్రాలకు నచ్చచెప్పడం ద్వారా వెంటనే చేపడతాం.
- జలవనరులను పెంచడానికి నదులపాయల్లో బ్యాలన్సింగ్ రిజర్వాయర్‌ల నిర్మాణాన్ని, కాల్వల మరమ్మతుల నిర్వహణను చేపడతాం.
- పైన చెప్పిన ప్రాజెక్ట్‌ల అమలుకు ఆర్థిక వనరుల సేకరణకు రాష్ట్రంలో సేద్యపు నీటి, విద్యుచ్ఛక్తి ఫైనాన్స్ కార్పొరేషన్ ను విడిగా ప్రోత్సహిస్తాం.

### 3. పరిశ్రమ :

అదనపురుణాలతో కొత్త సంస్థలు ఏర్పాటు చేయడం కంటే ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక ఉత్పత్తి సామర్థ్యాన్ని గరిష్ఠంగా ఉపయోగించుకోవడానికి పారిశ్రామిక పునరావాస బోర్డు ఏర్పాటు చేస్తాం. దీనివల్ల ఎక్కువ పెట్టుబడులు అవసరం లేకుండా

కొత్త ఉద్యోగాల సృష్టికి, ఆదాయ వనరుల పెంచడానికి ఉపయోగపడుతుంది.

### మా వాగ్దానం

- కొత్త ప్రాజెక్టుల క్లియరెన్స్‌కు ఏక గవాక్ష (సింగిల్ విండో) పద్ధతిని ఖచ్చితంగా అమలు చేస్తాం. కొత్త పారిశ్రామికవేత్తలకు సాయపడడానికి ఉన్నతాధికార బృందాన్ని ఏర్పాటుచేస్తాం.

వచ్చే ఐదేళ్ళలో విద్యుత్ చార్జీలు కొత్తగా పెంచబోం. కేంద్రరాయితీలకు అదనంగా ఉన్న చార్జీలే కొనసాగుతాయి.

- పారిశ్రామిక పునరావాస మండలి ఏర్పాటు చేస్తాం.
- చిన్న, కుటీర పరిశ్రమలకు ఆస్తుల పూచీకత్తు లేకుండా రుణసాయం అందించాలని కేంద్రం వాణిజ్యబ్యాంకులకు జారీచేసిన ఆదేశాలకు అనుగుణంగా ఇప్పుడున్న పరిశ్రమల పునరావాసానికి, కొత్త పరిశ్రమల ప్రోత్సాహానికి ప్రాధాన్యమిస్తాం.
- పూర్తి ఎగుమతులకు ఉద్దేశించిన పరిశ్రమలను నిర్ణీత కాల వ్యవధిలో నెలకొల్పడానికి ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటు. మార్కెటింగ్‌లో చేయూత నివ్వడానికి నోడల్ ఏజన్సీని ఏర్పాటుచేస్తాం.
- ఉపాధి అవకాశాలు, ఆదాయవనరులు పెంచడంలో చలనచిత్ర పరిశ్రమ పోషిస్తున్న కీలక పాత్ర దృష్ట్యా ప్రోత్సాహకాలు ప్రకటిస్తాం. తక్కువ ఖర్చుతో తీసే సినిమాలకు సబ్సిడీ, వినోదపు పన్ను మినహాయింపు వంటి రాయితీలు ఇస్తాం.
- కాంగ్రెస్ ప్రభుత్వం లోగడ చలనచిత్ర కార్మికులకు ఇచ్చిన స్థలాల్లో ఇళ్ళు నిర్మించి ఇస్తాం.
- నాణ్యతగల విత్తనాల ఉత్పత్తికి బయో టెక్నాలజీ పరిశ్రమ అభివృద్ధికి , ప్రోత్సహించడానికి పూర్తిగా కృషి చేస్తాం.
- పర్యాటక, హోటల్ పరిశ్రమలను ప్రోత్సహించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది.

### 4. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ :

సాఫ్ట్‌వేర్ రంగానికి పెరగబోతున్న ప్రాధాన్యతను ముందే ఊహించిన కాంగ్రెస్‌పార్టీ 1991లోనే ఆరు రాష్ట్రాల్లో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీపార్కులను నెలకొల్పింది. అదృష్టవశాత్తూ ఆంధ్రప్రదేశ్ ఆవిధంగా మొదటగా లబ్దిపొందింది. విద్యార్హతలు ఉండి బిపిఓలు, ఐటికంపెనీల్లో ఉద్యోగాలు పొందడానికి అవసరమైన అదనపు అర్హతలు, నైపుణ్యాలను అభ్యర్థులకు అందించడానికి 6 శిక్షణా కేంద్రాలను నెలకొల్పాలని కూడా ప్రతిపాదించాం.

రాజీవ్‌గాంధీ హయాంనుంచీకూడా ఇ-గవర్నెన్స్ ద్వారా రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు, కాంగ్రెస్‌పార్టీ కృషి చేస్తూనే ఉంది. రాష్ట్రంలో విస్తారంగా ఏర్పాటుచేసిన



బిఎస్ఎన్ఎల్ అప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ ద్వారా అక్షరాస్యతను మరింత పెంచడానికి, రైతులకు గ్రామీణ వృత్తిపనివారికి కొత్త సాంకేతికతను అందించడానికి ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తున్నది. ఇదే నెట్‌వర్క్ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రతి గ్రామానికీ ప్రతి ఇంటికీ చేరవేయడానికి అన్ని గ్రామాలను ఇంటర్‌నెట్ ద్వారా అనుసంధానం చేయడానికి ప్రత్యేక కృషి చేస్తాం.

### మా వాగ్దానం

- ఐటిని ఐటి ప్రభావిత సేవలను మరింతబాగా అభివృద్ధి చేయడానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తాం. ప్రతి రెండు జిల్లాలకు రాజీవ్ గాంధీ ఐటి హబ్ ఏర్పాటు చేస్తాం. అంతర్జాతీయ స్థాయి అనుసంధానం అందుబాటులో ఉన్న బెంగళూరు సమీపంలోని అనంతపూర్‌లో సెంట్రల్ హబ్ ఏర్పాటుచేస్తాం. అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయాలను విశాఖ, విజయవాడ, తిరుపతిలో కూడా ఐటి హబ్‌లు ఏర్పాటుచేస్తాం.
- బిపిఓ, కాల్‌సెంటర్‌ల వ్యాపారానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నందువల్ల రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో కనీసం 6 కేంద్రాలు నెలకొల్పి అర్హులైన గ్రాడ్యుయేట్‌లకు తగిన శిక్షణ ఇస్తాం.
- అన్ని గ్రామాలను ఇంటర్‌నెట్‌తో అనుసంధానం చేస్తాం.
- రైతులకు, చిన్న తరహా పారిశ్రామికవేత్తలకు అవసరమైన మార్కెట్ సమాచారాన్ని ఇంటర్నెట్, ఇతర మీడియా ద్వారా అందుబాటులో ఉంచుతాం.

## 5. ఇంధనం :

అదృష్టవశాత్తూ రాష్ట్రంలో సహజవాయువు వనరులు పుష్కలంగా ఉన్నాయి. పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్ట్‌లకు కూడా కాంగ్రెస్ పార్టీ ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తుంది. ఆర్‌టిపిపి రెండోదశ పూర్తయేటట్లు చూస్తాం. రాష్ట్ర సహజ వాయువు మొదట మన అవసరాలు తీర్చడానికే ఉపయోగపడేలా చూస్తాం.

### మా వాగ్దానం

- ఐదేళ్ళపాటూ కొత్త రాష్ట్రంలో గృహ వినియోగదారుల నుండి 100 యూనిట్ల వరకూ ఎటువంటి చార్జీలు వసూలుచేయం.

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణకు ప్రాధాన్యతనిస్తాం.

- పునరుత్పాదక, సాంప్రదాయేతర ఇంధన వనరులకు ప్రాధాన్యమిస్తాం. అనంతపురంలో సౌరవిద్యుత్, చిత్తూరు, కర్నూల్‌లలో పవన విద్యుత్ హబ్‌లను ఏర్పాటుచేస్తాం.
- తక్కువ వ్యవధిలో ఉత్పత్తిని చేపట్టే ప్రైవేట్ విద్యుత్ ప్రాజెక్ట్‌లు త్వరగా పూర్తయ్యేందుకు

కృషి చేస్తాం.

- విద్యుత్ ప్రాజెక్ట్‌లకు గ్యాస్ కేటాయింపులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాం.

## 6. గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమం :

రాష్ట్రంలో చేనేత కార్మికులకు ఉపయోగపడే విధంగా డిజైన్ల అభివృద్ధికి, నైపుణ్యం అభివృద్ధికి కృషి చేస్తాం. వీరికి అదనంగా బడ్జెట్ కేటాయిస్తాం.

### మా వాగ్దానం

ఎస్‌సి, ఎస్‌టి బిసి, మైనారిటీలతో సహా వితంతువులు, వృద్ధులందరికీ రు.1000 ల నెలవారీ పింఛన్ ఇస్తాం. ఇది వికలాంగులకు రు.1500 ల చొప్పున ఇస్తాం.

- శ్రీమతి ఇందిరాగాంధీ ఆశించినట్లుగా ఇందిర జనతా చీరలు, ధోవతుల పథకం ప్రవేశపెడతాం. నిరుపేదలకు కుటుంబానికి ఒక చీర, ఒక ధోవతి చొప్పున ఏటా మూడుసార్లిస్తాం.

- చేనేత పనివారికి చెందిన స్వయం సహాయ బృందాలకు రుణ సౌకర్యం కల్పిస్తాం. టెక్స్‌టైల్ టెక్నాలజీ పార్క్‌లతో ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంచి ప్రవాసం వెళ్ళిన కార్మికులను తిరిగి రప్పిస్తాం.

- మత్స్యకారులు డీజిల్‌పై చెల్లించే అమ్మకపు పన్ను పూర్తిగా మినహాయిస్తాం.

- మత్స్యకారుల బీమా దరఖాస్తులు మూడు నెలల్లోగా పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం.

## పట్టణాభివృద్ధి :

### మా వాగ్దానం

- అన్ని పట్టణాలు, నగరాల్లో మంచినీటి సౌకర్యం, మురుగుపారుదలకు ప్రాధాన్యం ఇస్తాం.

## 7. మౌలిక వసతులు :

- రహదారులు, రేవులు, టెలికమ్యూనికేషన్లు తక్షణావసరం. వీటికే అధిక ప్రాధాన్యత.

- విశాఖ, విజయవాడ, తిరుపతిలలో అంతర్జాతీయ విమానాశ్రయాల ఏర్పాటు, ప్రతి జిల్లాలో ఒక గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్.

- కాకినాడ, మచిలీపట్నం రేవుల స్థాయిపెంపు, దుగరాజపట్నం, రామాయపట్నం, మచిలీపట్నం, నిజాంపట్నంలలో కొత్తరేవుల నిర్మాణం

- ప్రధాన ఓడరేవులకు అనుబంధంగా ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణం

- జలరవాణా మార్గంగా చెన్నై, కాకినాడ బకింగ్‌హామ్ కెనాల్‌పై తక్షణ చర్యలు

- ఎపిఎస్ఆర్‌టిసి సంస్థ ఉద్యోగుల ఫిర్యాదులను సానుకూలంగా పరిశీలిస్తాం.

ప్రతి చేతికి శక్తి
ప్రతి చేతికి అభివృద్ధి



- టెలీకమ్యూనికేషన్ల అభివృద్ధికి ఇప్పటికే బిఎస్ఎన్ఎల్, ప్రైవేట్ సంస్థల ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ సిద్ధంగా ఉంది.

- రైలు మార్గాల ఆధునికీకరణ, కొత్త రైల్వే జోన్ ఏర్పాటు, మేజర్ రైల్వే స్టేషన్‌ల అభివృద్ధి, కొత్త రైల్వే లైన్ల ఏర్పాటుకు కృషి.
  కొండపల్లి–కొత్తగూడెం
  కృష్ణపట్నం–ఎర్రగుంట్ల
  పిఠాపురం–కాకినాడ.

- రోడ్ మార్గాలలో రాజధాని నుండి జిల్లా కేంద్రాలకు 6 లైన్ల మార్గాలు, జిల్లా నుండి మండల కేంద్రాలకు 4 లైన్ల మార్గాల అభివృద్ధి.

## 8. విద్య :

- ఎస్ఎస్‌సి పూర్తి చేసి ప్రభుత్వ కళాశాలల్లో, ఎయిడెడ్ కళాశాలల్లో ఇంటర్‌లో చేరే విద్యార్థులకు లాప్‌టాప్‌ల అందచేత.

- వచ్చే ఐదేళ్ళలో పారిశ్రామికీకరణ కోసం 5 లక్షల కోట్ల పెట్టుబడులద్వారా కోటి ఉద్యోగాల సృష్టి.

- ప్రతి మండల కేంద్రంలో ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు.

- మాధ్యమిక స్థాయి వరకు తెలుగు నిర్బంధ బోధన

- వచ్చే ఐదేళ్ళలో దేశంలో అక్షరాస్యతలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలపడానికి విద్యారంగంలో పెట్టుబడులు.

- ప్రభుత్వ కళాశాలలన్నింటిలో బాలికలకు ఉచిత విద్య.

విశ్వవిద్యాలయాలు ఉన్న ప్రతీ చోటా వాటికి అనుబంధంగా ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలు ఏర్పాటు.

- కొత్తగా పలు ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల ఏర్పాటు.

## 9. పర్యాటక అభివృద్ధి :

- అనంతపురంలో కేంద్రం మంజూరు చేసిన మెగా టూరిజం అభివృద్ధికి కృషి.

- తిరుపతి, శ్రీకాళహస్తి, కాణిపాక్కం, వెల్లూరు క్షేత్రాల మధ్య సర్క్యులర్ రైల్వే లైన్ల అభివృద్ధి.

- మూడు అంతర్జాతీయ విమానాశ్రయాల్లో పర్యాటక సమాచారకేంద్రాల ఏర్పాటు.

## 10 ఆరోగ్యం :

- *అందరికీ ఆరోగ్యం :* ప్రతిపౌరుడికీ ఉత్తమ చికిత్స అందిచడానికి కృషి.

- 2013–14లో కేంద్రం ప్రవేశపెట్టిన ఆరోగ్యబీమా పథకం ప్రయోజనాలు ప్రతికుటుంబానికీ అందేవిధంగా కృషి. నిరుపేదలకు రు. 30 వేల వరకూ వైద్య ఖర్చులు తిరిగి చెల్లింపు.

♦ జిల్లా ఆస్పత్రులు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులుగా (నిమ్స్ తరహాలో) ఆధునీకరణ చేయడం. ఆదాయపుపన్ను చెల్లింపుదారులు మినహా మిగిలిన అందరికీ రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డులద్వారా అధునాతన వైద్యం

♦ అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జనరిక్ మందులు లభించేలా చర్యలు. అన్ని హంగులతో జిల్లా స్థాయి ఆసుపత్రుల నిర్మాణం, వాటికి అనుబంధంగా మెడికల్ కళాశాలల ఏర్పాటు.

**ఎస్సి, ఎస్టీ, బిసిలు :**

♦ వెనుకబడిన తరగతుల కమీషన్ పునర్వ్యవస్థీకరణ, కొత్త కమీషన్ సిఫార్సుల ఆధారంగా కాపు, బలిజ వంటి పలు కులాలకు వెనుకబడిన తరగతుల జాబితాలో చోటు

♦ అలాగే రజక, వాల్మీకి(బోయ), వడ్డెర, కొండకుమ్మరి, బెస్తలను ఎస్సి, ఎస్టిల్లో చేర్చాల్సిందిగా ఎస్సి, ఎస్టి కమీషన్‌కు గట్టి సిఫార్సు.

♦ భూములులేని ఎస్సి, ఎస్టి ఇతర బలహీన వర్గాలవారికి భూములున్నచోట ప్రభుత్వ వ్యవసాయ భూముల కేటాయింపు. లేనిచోట ప్రభుత్వమే కొని ఇస్తుంది.

♦ రుణ సౌకర్యం పొందడానికి వీలుగా డికె పట్టాభూములు, శాశ్వత పట్టాలుగా మార్పు.

♦ పారిశ్రామికీకరణ ప్రోత్సాహకాల్లో భాగంగా ఎస్సి, ఎస్టి కొత్త పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకాలు.

♦ పరిశ్రమలతో సమానంగా చేనేత పనివారికి రాయితీ చార్జీలపై విద్యుచ్ఛక్తి

♦ ప్రైవేట్‌రంగంలో కూడా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పాటించేలా చేయడానికి కృషి

**మహిళా సాధికారికత :**

**ప్రియదర్శిని :** ఆడపిల్ల పుట్టిన వెంటనే 100 గజాల స్థలం ఆమె పేరిట రిజిస్ట్రేషన్ చేసి, ఆమె వివాహ సమయానికి శాశ్వత గృహనిర్మాణం చేసి ఇవ్వడం. బంగారుతల్లి పథకానికి అదనంగా ప్రియదర్శిని పథకం అమలు చేస్తాం.

♦ స్వయం సహాయక బృందాలు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తాం.

పట్టణ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అమ్మేలా సంచార క్యాంటీన్లను పట్టణ ఇందిరా క్రాంతి పథం బృందాలకు అప్పగిస్తాం

ప్రతి గ్రామంలో ఇంటర్నెట్, మీసేవ కేంద్రాలను స్వయం సేవా బృందాలకు అప్పగిస్తాం.

♦ స్త్రీలకు డిష్ కనెక్షన్‌తో సహా కలర్ టివి ఉచితంగా అందిస్తాం.

♦ కేంద్ర ప్రభుత్వం నుండి అందుతున్న సహాయానికి అదనంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు, హెల్పర్లకు



ఇంటి సౌకర్యంతోపాటూ సాయపడేవిధంగా సమగ్ర పథకాన్ని ప్రకటిస్తాం.

- ♦ అన్ని బెల్టు షాపులను మూసివేయిస్తాం. దశలవారీగా మద్యనిషేధం అమలు చేస్తాం. తాగుడువల్ల జరిగే అనర్థాలను ఎక్కువగా ప్రచారం చేస్తాం.

- ♦ తొల ఏడాదిలోనే అర్హులైన నిరుపేద కుటుంబాల కన్నింటికీ 100% దీపం కనెక్షన్లు ఇస్తాం.

**యువత :**

యువత సాధికారికతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది. ప్రతిజిల్లా కేంద్రంలో ఉపాధిపరంగా వృత్తి శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. అర్హులైన అభ్యర్థులకు కంప్యూటర్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తాం.

యువకులకు క్రీడా స్ఫూర్తినిచ్చేందుకు ప్రతీ మండలంలో క్రీడా ప్రాంగణాలు జిల్లా కేంద్రంలో జాతీయ స్థాయి క్రీడా ప్రాంగణం, క్రీడాకారుల హాస్టళ్ళు, స్పోర్ట్స్ అకాడమీల ఏర్పాటు. మూడు ప్రాంతాల్లో మూడు స్పోర్ట్స్ కళాశాలలు, రాష్ట్రంలో ఒకచోట స్పోర్ట్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు.

- ♦ ప్రభుత్వ కళాశాలల్లో, ఎయిడెడ్ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు వారి చదువు ముగిసిన నాటి నుండీ నెలకు రు. 2000 చొప్పున మూడేళ్ళపాటూ నిరుద్యోగ భృతి చెల్లిస్తాం.

**మైనారిటీలు :**

స్వాతంత్ర్యం వచ్చిననాటినుండీ నేటి వరకూ లౌకిక వాదానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది. వారి సంక్షేమానికి సముద్ధరణకు పాటుపడుతున్నది.

- ♦ హిందూ దేవాదాయ చట్టంతో సమానంగా వక్ఫ్ బోర్డ్‌కు కూడా ఎగ్జిక్యూటివ్ అధికారాలిస్తాం.

- ♦ షాదీఖానాలు, మసీదులు, శ్మశానాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తాం.

- ♦ మైనారిటీల విద్య, అభివృద్ధికి సంక్షేమానికి చర్యలు

- ♦ మైనారిటీలకు ఐటిఐ, పాలిటెక్నిక్, ఆశ్రమ పాఠశాలలను వీలయితే ప్రతి జిల్లాలో ఏర్పాటుచేస్తాం.

- ♦ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా యువకులకు ఉపాధి

- ♦ వారికి తగినంతగా బడ్జెట్ కేటాయింపులు

- ♦ మైనారిటీ మహిళలకు ప్రత్యేక కార్పొరేషన్

- ♦ రెండో అధికార భాషగా ఉర్దూకు గుర్తింపు

- ♦ వారి పర్సనల్ 'లా'ను గౌరవిస్తాం. తగిన భద్రత కల్పిస్తాం.

- ♦ వారి జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వారికి ఇళ్ళ కేటాయింపు

### హిందూ దేవాదాయ చట్టం :

- ధార్మిక పరిషత్‌లో అర్చకులకు ప్రాతినిధ్యం కల్పిస్తూ దాన్ని పటిష్ట పరుస్తాం.
- అర్చకుల సంక్షేమంపై శ్రద్ధ
- రు. 2 లక్షలలోపు ఆదాయం ఉన్న ఆలయాలను అర్చకులకు అప్పగించి వారి జీతాలు, దేవాదాయ శాఖ చెల్లించే విధంగా ఏర్పాటుచేస్తాం.

### దళితుల సాధికారత :

- ఇందిరమ్మ పథకంలో భాగంగా అన్ని సౌకర్యాలతో ఇళ్ళు నిర్మించిస్తాం.
- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమలు ఏర్పాటుచేసుకోవడానికి అందించే రుణ పరిమితిని రు. 5 కోట్ల నుండి రు. 25 కోట్లకు పెంచుతాం
- రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌సి కాలనీలన్నింటిలో పూర్తి పరిశుభ్రమైన తాగునీరు అందిస్తాం.

### దళిత క్రైస్తవులు :

- దళిత క్రైస్తవుల చర్చిలకు, ఆస్తులకు, భూములకు రక్షణ కల్పిస్తాం. వారికి ప్రతి గ్రామంలో, పట్టణంలో శ్మశాన స్థలాలు కేటాయించడానికి ప్రాధాన్యం ఇస్తాం.
- వారి సామాజిక భద్రతకు వీలుగా చట్టంలో సవరణలు తీసుకువస్తాం.

### ఇంకా.........

- రజకుల సముద్ధరణకు కాంగ్రెస్‌పార్టీ అధిక ప్రాధాన్యత ఇస్తుంది.
- ప్రభుత్వ సంస్థలద్వారానే కాకుండా ప్రైవేట్ ఆస్పత్రులతో ఒప్పందాలు చేసుకోవడం ద్వారా అన్ని కుటుంబాలకూ ఉన్నత ప్రమాణాలు కల వైద్యసౌకర్యాలు ఉచితంగా అందించడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది.
- ఇల్లులేని ప్రతి పేద కుటుంబం సొంత ఇంటి హక్కును పొందడానికి వీలుగా చట్టాన్ని తీసుకువస్తాం
- తెలుగు మాట్లాడడం, నేర్చుకోవడం, ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలలో తెలుగు వాడకంవంటి చర్యలను తగువిధంగా ప్రోత్సహిస్తాం. ఇతర భాషలు మాట్లాడేవారిపట్లకూడా శ్రద్ధవహిస్తాం.
- కొత్త రాష్ట్రంలో తెలుగు ప్రాచీన పీఠం, తెలుగు అకాడమీ, తెలుగు విశ్వ విద్యాలయం ఏర్పాటు చేస్తాం.
- అవసరమైన విద్యార్హతలుండి సుదీర్ఘ సేవలందించిన తాత్కాలిక ఉద్యోగుల క్రమబద్ధీకరణను పరిశీలించడానికి ఉన్నతాధికార మండలిని ఏర్పాటుచేస్తాం.
- ప్రస్తుతం ఉన్న 13 జిల్లాలను పునర్వ్యవస్థీకరించి మరో 12 జిల్లాలు కొత్తగా ఏర్పడేవిధంగా,

ప్రతి చేతికి శక్తి
ప్రతి చేతికి అభివృద్ధి



కొత్త రెవిన్యూ డివిజన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

**సంక్షిప్తంగా మా తీర్మానాలు ఇవి :**

వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలతో దీటుగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడానికి తద్వారా ఆర్థిక అభ్యున్నతి, మానవ వనరుల వికాసానికి పార్టీ కట్టుబడి ఉన్నదని పునరుద్ఘాటిస్తున్నాం. అభివృద్ధి అనే దానిని సామాజిక న్యాయం, సమానత్వం ఆధారంగా సాధించాలనేది కాంగ్రెస్ సిద్ధాంతం. ఆర్థిక సంస్కరణలకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉన్నప్పటికీ రాష్ట్రంలో మొత్తం శ్రామిక శక్తిలో అధిక భాగం గ్రామీణ రంగంలో ఉన్నందువల్ల ఆ సంస్కరణలు పారిశ్రామిక, సేవా రంగాలకంటే ముందు వ్యవసాయ, గ్రామీణరంగాల్లో రావాలనేది పార్టీ ప్రగాఢ ఆకాంక్ష.

ఫెడరల్ వ్యవస్థలో, సమైక్యత, సమగ్రత విధానాలను పాటించే ఒక జాతీయ పార్టీగా అన్ని రాష్ట్రాలు, అన్ని ప్రాంతాల ప్రజలు సఖ్యతతో జీవించాలని పార్టీ కోరుకుంటుంది.

ప్రధాని తన ప్రసంగంలో పేర్కొన్న 6 సూత్రాలతో సహా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2013 లో పొందుపరిచిన అన్ని అంశాల అమలుకు కాంగ్రెస్ పార్టీ శక్తివంచన లేకుండా కృషి చేస్తుంది.

ఉత్తరకోస్తా, రాయలసీమలలోని వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు అమలవుతాయి. పోలవరం ప్రాజెక్టును కేంద్రమే చేపడుతుంది. అవశేష ఆంధ్రప్రదేశ్ తొలి ఏడాది బడ్జెట్ లోటును కేంద్రమే భర్తీ చేస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా 5 ఏళ్ళపాటు ఉంటుంది. ఈ హోదా మూడు ఉత్తర కోస్తా జిల్లాలకు, నాలుగు రాయలసీమ జిల్లాలకు వర్తిస్తుంది.

పారిశ్రామికీకరణ ప్రోత్సాహానికి పలు పన్ను రాయితీలుంటాయి.

**జై కాంగ్రెస్ !!**
**జై ఆంధ్రప్రదేశ్ !!**



నవ్యాంధ్రప్రదేశ్ మన స్వప్నం
కాంగ్రెస్‌తోనే అది సాధ్యం




## ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటి

ఇందిర భవన్, హైదరాబాద్-500001. ఫోన్స్: 040-24601889, 24749899, ఫాక్స్: 040 24731899


Published by: APCC, *Printed at*: Caxton Offset Pvt. Ltd., Hyd. Copies: 5,000